


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుణ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

*కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో*
*అలనాటి అందమైన నవల పునర్ముద్రణ*

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**"అదెలా రాజ్యలక్ష్మీ?"** అనడిగాడతను వ్యాకులపాటుతో.

ఆమె తలవంచుకుని సన్నని స్వరంతో "నేను చెప్పేది విని నన్నసహ్యించుకోకుండా వుంటారా?" అన్నది.

"నిన్నా? నేనా? అసహ్యించు కోవటమా? ఏం ప్రశ్న రాజ్యలక్ష్మీ?"

సీతానగరం కొండలమాటున సూర్యుడు అస్తమిస్తున్నాడు. "మీతో పరిచయం కావటానికి కొద్దిరోజుల క్రితం జరిగింది మధుబాబూ" అని చెప్పసాగింది. ఓ క్షణం ఆగి "మా అమ్మ నా చిన్నప్పుడే చనిపోయిందని మీకు చెప్పానా? మా నాన్నగారు త్వరలోనే మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు. పిన్ని మంచిదే, నన్ను ఎంత ప్రేమగానో పెంచింది. ఆమెకో తమ్ముడుండేవాడు. అప్పుడప్పుడూ మా యింటికొస్తూ వుండేవాడు, వట్టి కబుర్లపోగు. నన్ను కవ్విస్తూ, నవ్విస్తూ వుండేవాడు. నేను వయసులో చాలా చిన్నదాన్నే. అనుభవం బొత్తిగా లేదు. అతనంటే ప్రేమకాదుగానీ ఓ రకం ఆకర్షణగా, వ్యామోహంగా వుండేది, ఓ రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతడు తన మాటల్తో నన్ను ఏదో లోకానికి తీసుకువెళ్ళి హఠాత్తుగా నన్ను తన చేతుల్లోకి తీసుకున్నాడు . వారిద్దామనుకున్నాను. తిరస్కరిద్దామనుకున్నాను. కాని ఎందుచేత అలా అయిపోయానో తెలీదు. వాంఛ అనీ చెప్పలేను. ఏమీ చేయలేకపోయాను. ప్రతిఘటించలేకపోయాను."

ఆమె కళ్ళనుంచి నీళ్ళు కారసాగాయి. "నన్ను అంధకారంలో ముంచివేసి వెళ్ళిపోయాడా రాత్రి. స్తబ్దుగా పడివున్నాను మంచం మీద. ఇంత చిన్నదాన్ని ఎందుకిలా జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నాను? వలవలా ఏడ్చేశాను, అంతా శూన్యంగా ఉంది. చెప్పలేని బాధ. మరునాడు వచ్చాడు. అతడ్ని చూస్తే ఓ రాక్షసుడ్ని చూసినట్లుగా అనిపించింది. అసహ్యం, భయం కలిగాయి, ఇట్లాంటి వ్యక్తికి నేనెలా లొంగిపోయాను? నేను చేసిన పొరపాటు అనుక్షణం తలుపుకువొచ్చి నన్ను కాల్చసాగంది. అవకాశం చిక్కినప్పుడల్లా అతను నాదరి చేరటానికి ప్రయత్నిస్తూ వుండేవాడు, నేను తప్పించుకు తిరుగుతూ వుండేదాన్ని. అతనంటే నాకేమీ లేదని తెలుసుకున్నాను. ఎలా భరించేది అతన్ని? ఓసారి యీ విషయం స్పష్టంగా చెప్పేశాను, కోపం వచ్చి మా విషయం పిన్నికి చెప్పేశాడు.

ఆమె వచ్చి "నిజమేనా?" అని అడిగింది. ఒప్పుకున్నాను. నన్ను నానా తిట్లూ తిట్టి అతన్నే పెళ్ళి చేసుకొమ్మని శాసించి వెళ్ళిపోయింది. నాకు వేరే ఇంకెవరితోనూ పెళ్ళికాదు. అతనంటే రోజు రోజుకు అసహ్యం పెరిగిపోతోంది. ఎట్లా జీవించేది ఈ సంఘర్షణలతో. జీవితం మీద ఇచ్ఛ నశించింది. ఇంక బ్రతకను ఎంతో కాలం."

ఏడుస్తోంది రాజ్యలక్షి. చేతులతో ముఖం కప్పుకుని విలపిస్తోంది. మధుబాబు హృదయం ద్రవించసాగింది. ఇంత లేతవయసులో ఈ పసి పాపవంటి అమ్మాయికి ఏమిటిది?

చీకటీ పడుతోంది.

"నేనంటే అసహ్యంగాలేదా ఇప్పుడు" అనడిగింది.

ఆమె మొఖాన ఉన్న చేతులు తొలగించి, డగ్గుత్తికతో "లేదు లేదు రాజ్యలక్ష్మి" అంటూ అతనామె దగ్గరకు జరిగాడు.

"పాపిష్టిదాన్ని. పతితను. నన్ను తాకి మీ శరీరం మలినం చేసుకోకండి మధుబాబూ."

అతడామె చేతిని ఆప్యాయంగా తన చేతులలోకి తీసుకుని "నిన్ను పెళ్ళి చేసుకుంటాను రాజ్యలక్ష్మి. ఇది నిజం అన్నాడు" దృఢ నిశ్చయంతో.

ఆమె కంగారుపడుతూ "వద్దు వద్దు మధుబాబూ. పండువంటి మీ జీవితం ఈ దౌర్భాగ్యురాలికోసం నాశనం చేసుకోకండి. అర్థం లేదు మీ త్యాగానికి" అన్నది.

"నన్ను సంశయిస్తున్నావా రాజ్యలక్ష్మీ"

"మీకు తెలీదు మధుబాబూ. మీ చరిత్ర కలుషితము అవుతుంది."

'ఎన్నటికీ కాదు.'

కొంచమాగి ఆమె "మా ఇంట్లో అంగీకరిస్తారనే ఆశలేదు. రాక్షసుల క్రింద మారారు వాళ్ళు..."

మధుబాబు నిట్టూర్పు విడిచి "నాకోసం మీ వాళ్ళని ఎదురించలేవా?" అన్నాడు.

అతని చేతులలో ఆమె చెయ్యి వొణికింది. "మీ కోసం ఏమయినా చేస్తాను" అన్నది కాసేపు. కాని ఆమె కంఠస్వరం ఆమెనే వెక్కిరించినట్లు తోచింది.

చాలాసేపు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు, బాగా చీకటిపడింది. మధుబాబుకు మనసులో చాలా చెప్పాలనివుంది. ఇంత లేత వయస్సు ఇలా ఇద్దరూ అనుకోకుండా దగ్గరకు చేరటం.. ఈ అనుభూతులు.. తన ధైర్యం. అతనికి అయోమయంగా వుంది.

"ఇంక పోదాం మధుబాబూ" రాజ్యలక్ష్మి గొంతు గాద్గదికంగా వినబడింది.

"పద" అతను లేచాడు.

ఇద్దరూ ఒకరినొకరు అనుకుని నడవసాగారు.

"రాజ్యలక్ష్మీ ఈ పరిస్థితి ఏమీ నీ కిష్టంగా లేదా?"

"లేదు లేదు. చాలా బాగుంది."

అతను నిట్టూర్పు అణుచుకున్నాడు.

❦❦❦

అటు తల్లీ, తండ్రీ. ఇటు భవిష్యత్. ఏమో అర్థంకాని ఆశయాలు. ఏమిటిది అర్థంకాని పయనం? తగునా ఈ నిర్ణయం.

తనని ఆకర్షించింది రాజ్యలక్ష్మి. హృదయంలో స్థావరం ఏర్పరచుకుంది. కానీ దీనిని ప్రేమ అనే సాహసంలేదు తనకు. తను ఇంకా అంతటి అంతస్థుకు ఎదగలేదు. ఒకవేళ ఇది వ్యామోహమే ఐతే దీనికి అంతెక్కడ? తల్లీ తండ్రీ, వీళ్ళని ధికరించటం ఎలాగ? ఓ కుర్రవాడు తను. లేత వయసు యువకుడు. కొంత అయోమయ ఒప్రకృతి.

అలిసిపోయాడు మధుబాబు ఆ రాత్రి ఆలోచనలతో.

అతనికి భయం వెయ్యసాగింది.

❦❦❦

కాని మధుబాబు తన ధైర్య సాహసాలు ప్రదర్శించే అవకాశం సంఘటిల్లకుండానే, అతను ఎటూ కొట్టుకుపోయే పరిస్థితి ఆసన్నం కాకుండానే, రాజ్యలక్ష్మి ఓ మహా సాహసం చేసింది.

అది ఆత్మహత్య.

కాలేజీ అవతల నిండుగ ప్రవహించే కాలవ వుందే ఓసారి అక్కడి ప్రాంతంలో నిలబడి సగం విరిగిన కొండను తిలకించిందే. సరిగ్గా అక్కడే నిలబడి ఆ హతభాగ్యురాలు ప్రవహించే నీళ్ళలో దూకేసింది.

ఆ నీళ్ళలో కొట్టుకుపోయింది రాజ్యలక్ష్మి. ఆమె శవం ఎక్కడో తేలింది.

మధుబాబు ఓ వెర్రికేక వేశాడు. చావాలనుకున్నాడు. జుట్టు పీక్కున్నాడు. అంతే అదో అధ్యాయం.

ప్రపంచం మామూలుగా సాగిపోతూనే వుంది, సగం చచ్చిన మధుబాబుని తనతో తీసుకుపోతూ.

## 11

మధుబాబు రిజల్ట్సు తెలిశాయి. అతను ప్యాసయినాడు. కాని క్లాసు రాలేదు. విశ్వనాధంకాస్త విసుక్కున్నాడు. అందులో సగం సతిమీదా, సగం తనయుడిమీదా ప్రదర్శించాడు. క్లాసు రాకపోతే ఎమ్.బి.బి.ఎస్‌లో సీటు ఎలా వస్తుందని ఆయన ఆరాటం. తాత్కాలికంగా యీ చదువు మీద ఉత్సాహంగా లేదు మధుబాబుకి. అందుచేత ఎక్కువ దిగులనిపించటంలేదు. యాంత్రికంగా అన్ని మెడికల్ కాలేజీలకు అప్లికేషన్లు పంపించాడు. మణిపాల్‌లోనూ, బెంగుళూరులోనూ డొనేషన్ కాలేజీలున్నాయి. వాటికి రాస్తే మరో రెండు మూడు ఏళ్ళవరకూ సీట్లు రిజర్వు

అయిపోయాయనీ, ఇప్పుడు డబ్బు కడితే మరో రెండేళ్ళ తర్వాత సీటు లభించే అవకాశం వుందని జవాబు వచ్చింది. అంతకాలం ఆగటమా? మధుబాబుకు మనస్కరించలేదు. తాను సాధ్యమైనంత త్వరలో జీవితంలో ప్రవేశించాలి. తన కాళ్ళమీద నిలబడగలగాలి. ఒకవేళ ఎమ్.బి.బి.ఎస్‌లో ఎక్కడా సీటు రాకపోతే ఏం చేసేటట్లు? తండ్రిలా బిజినెస్‌లో ప్రవేశించటమా? అతనికి ఇష్టంలేదు బొత్తిగా. వ్యాపారంలో తను అసలు ప్రవేశించలేడు. అటు రాజ్యలక్ష్మి స్మృతులు, ఇటు యీ విద్యా సమస్య.. అతని సాహిత్య వ్యాసంగం బొత్తిగా మూలబడింది. ఎక్కడకు వెళ్ళినా చుక్కెదురౌతూండేసరికి ఇంట్లో తండ్రి ధాంధూంలు హెచ్చసాగాయి. అతనికి ఇంట్లో వుండాలనిపించలేదు. ఎక్కడికయినా పోయి వంటరిగా గడపాలనిపిస్తోంది. కాని ఎలా సాధ్యం? మనశాంతి నశించింది. చివరకు దేనిమీద తనకు ఇష్టం వుందో తేల్చుకోలేని స్థితికి వచ్చాడు.

అతనికి క్లాసు రాకపోయినా మార్కులు బాగానే వచ్చాయి. అందుకని అనుకోకుండా విశాఖపట్నం కాలేజి నుంచి ఇంటర్వ్యూ పిలుపు వచ్చింది. తండ్రి ముఖం ఇంతయింది. సీటు వచ్చినట్లుగానే పొంగిపోయాడు. ఇంటర్వ్యూలో ధైర్యంగా జవాబులు చెప్పమని కొడుకుని ప్రోత్సహించసాగాడు. తను కూడా వస్తానన్నాడు. అక్కర్లేదని చెప్పి మధుబాబు వంటరిగా రైలెక్కాడు.

జీవితంలో మొదటిసారిగా టక్ చేసుకుని ధైర్యంగా ఇంటర్వ్యూకి వెళ్ళాడు. వాళ్ళేదో ప్రశ్నలు వేశారు కలగాపులగంగా. తనకు తోచిన సమాధానాలు చెప్పేశాడు. "నీ హాబీస్ ఏమిటి?" అని ఒకాయన అడిగాడు.

"కళారాధన" అన్నాడు మధుబాబు గర్వంగా.

"ఏవయినా అచ్చయినాయా?" అన్నాడు ఒకాయన ఎగతాళిగా.

"ఎన్నో అచ్చయినాయి. రేడియోలో కూడా వచ్చాయి."

"మరి లిటరేచర్ తీసుకోక మెడిసన్ ఎందుకు ట్రై చేస్తున్నావ్?"

"అది నా హాబీ అంతే. దానిమీద జీవించలేనని నాకు తెలుసు. అంతేగాక డాక్టరునై ప్రజాసేవ చెయ్యాలని వుంది" ఇంటర్వ్యూ ముగిసింది. మధుబాబు ఆ సాయంత్రమే రైలు ఎక్కి ఇంటికి వచ్చేశాడు.

రోజులు గడవసాగాయి. ఫలితం కోసం యెదురు చూడసాగాగారు ఇంటిల్లపాది. అది ఒకవేళ రాకపోతే యీలోగా పుణ్యకాలం కాస్తా గడిచిపోతుందని గుంటూరు బి.ఎస్.సిలో చేరి మొదటి టెరమ్ జీతం కట్టి వచ్చాడు.

కొన్నాళ్ళకు ఫలితాలు తెలిశాయి. మధుబాబుకు సీటు రాలేదు. కానీ అతని పేరు వెయిటింగ్ లిస్ట్‌లో వుంది. తండ్రీ కొడుకులిద్దరూ నిస్పృహ చెందారు. అయినా ఓ ఆశ మిణుకు మిణుకు మంటోంది. రాకపోతుందా అని. "గుంటూరు కాలేజికి పోయి వస్తూండరా! అక్కడ కూడా అటెండెన్స్ పోవటం దేనికి?" అన్నాడు తండ్రి ఉసూరుమంటూ. మధుబాబు ప్రొద్దున్నే రైలెక్కి గుంటూరెళ్ళి సాయంత్రం కాగానే తిరిగి రాశాగాడు, యాంత్రికంగా గడుస్తున్నాయి. అతనికి విసుగ్గా వుంది.

అయితే వున్నట్లుండి విశాఖపట్నంలో సీటు వచ్చిందన్న వార్త తెలిసింది.

12

మెడికల్ కాలేజి జీవితం చాలా కొత్తగా కనిపించింది. ఆర్ట్స్ కాలేజీలోలాగా ఇక్కడ విచ్చలవిడిగా వుండరు విద్యార్థులు. ప్రతివాడికీ ఓ వ్యక్తిత్వం, ఓ అహంభావం, ఏదో ప్రకర్ష – కళాత్మకమైన అనుభూతి ఏమీ వుండదు. అసలు విద్యార్థికి తీరిక అంటూ లేదు. ఉదయంనుంచీ సాయంత్రం వరకూ ఆ శవాల మధ్య, మైక్రోస్కోప్‌ల ముందు, లేదా ప్రొఫెసర్ల చేత చీవాట్లు తింటూ యంత్రంలా పనిచేసుకు పోవాలి. గదికి వచ్చాక మరునాటికి తరగని పని. రాత్రి పన్నెండూ, ఒంటగంటా అయ్యేవరకు చదువుతోనే సరిపోయేది. ఇహ విశ్రాంతి. కొంతమందికి ఆటల ప్రమేయం వుండేది. మధుబాబు సాహిత్య పిపాస గురించి ఎవరూ పట్టించుకునే అవకాశం లేకపోయింది. ఓ రకంగా ఇంచుమించు అతనే మరిచిపోయాడు.

కాలేజి వాతావరణంలో పడి అదంటే ఆసక్తి కూడా సన్నగిల్లింది. ఇదివరకు నిరంతరం ఏదో ఒక యితివృత్తాన్ని గురించో, పాత్రను గురించో మనసులో మెదుల్తూండేది. ఇప్పుడు ఏదో అస్పష్టంగా ఎప్పటికైనా రాయాలి అన్న ఆరాటమేగని నిర్దుష్టమైన వొత్తిడి ఏమీలేదు లోపలినుంచి. పైగా మూడునెలల్లోనే కెమిస్ట్రీ పరీక్షలు. అతను హడావుడిగా చదవసాగాడు. రాజ్యలక్ష్మిని అతడు మరిచిపోలేదు. కాని గుర్తుపెట్టుకుని చేసేదేముంది? నిద్రపాడు చేసుకుని కన్నీళ్ళు విడవటం తప్ప.

క్రమంగా మెడికల్ కాలేజి వాతావరణానికి అలవాటు పడిపోయాడు. జీవితంలో ఇదివరకెన్నడూ ఇంత కష్టపడి చదవలేదు. తన ఓపికకి తనకే ఆశ్చర్యంగా వుండేది.

కెమిస్ట్రీ లెక్చరర్ పేరు శ్యామలరావుగారు. ఆయన ఇంకా యువకుడు. సాహిత్యంలో చాలా అభిలాష వుంది. ఎవరో మధుబాబుని గురించి ఆయన చెవిలో ఊదారు. ఇతని కథలు ఆయన కొన్ని చదివి వున్నాడు.

"అరె! ఇంత చిన్నవాడా ఇతను?" అని విస్మయం చెంది ఓసారి ప్రాక్టికల్ హాలులో పలకరించి "ఓసారి మా ఇంటికి రండి" అని ఆహ్వానించాడు మధుబాబును.

మరునాటి సాయంత్రం మధుబాబు ఆయనకోసం వెళ్ళాడు. ఆయన కూర్చోబెట్టి, కాఫీ యిచ్చి చీకటిపడేవరకూ ఏవో వివిధ విషయాలను గురించి మాట్లాడుతూ కూర్చున్నారు. లిటరేచర్‌లో ఆయనకంత అభినివేశం వుందని మధుబాబుకి పూర్వం తెలియదు. ఈ వాతావరణంలో ఇలాంటి తోడు దొరికినందుకు అతనికి చాలా సంతోషంగా వుంది. ఇద్దరూ ఎంతో సన్నిహితులై పోయారు. అప్పటినుంచి అవకాశం వున్నప్పుడల్లా కలుసుకుంటూ వుండేవాళ్ళు. మధుబాబు సబ్జెక్టుని గురించి తనకున్న అనుమానాలు, ఆయన్ని అడిగి తీర్చుకుంటూ వుండేవాడు.

ఎలక్షన్ల విషయంలో ఇక్కడకూడా ఆ వాతావరణమే వుండటం గ్రహించాడు మధుబాబు. వాటిల్లో పాల్గొనటానికి అతనికి మనస్కరించలేదు. కానీ అతను రచయిత అని తెలిసి బలవంతంగా మేగజైన్ సెక్రటరీగా అతన్ని నిల్చోబెట్టారు. తీరాచూస్తే అతనికి పోటీలేకుండా పోయింది. అతను ఏకగ్రీవంగా ఎన్నిక అయినాడు.

కెమిస్ట్రీ పరీక్షలు జరిగాయి. మదుబాబు ఓరల్స్ కూడా బాగానే ఆన్సర్ చేసి ఇంటికి బయల్దేరాడు. ఎగ్జామినర్స్ అందరూ రైల్లో  పోతూండగా కాలక్షేపానికి శ్యామలరావు మిగతా వాళ్ళకు ఓ కథ చెప్పి "ఇది రాసింది మా స్టూడెంటే. పేరు మధుబాబు" అని చెప్పాడు.

చిత్రం ఏమిటంటే ఎగ్జామినర్స్‌లో ఒకరికి మధుబాబు అభిమాన రచయిత. "అయ్యో ముందుగా చెప్పకపోయారే. అతనెవరో తెలీకుండానే అతని ఓరల్స్ తీసుకున్నానా? అతను పరీక్ష ప్యాసయ్యాడో లేదోనండీ. " నెంబరెంత?" అని ఆదుర్దా పడసాగాడు. శ్యామలరావుగారికి కూడా అతని నెంబరు గుర్తు రాలేదు.

"జ్ఞాపకం లేదండీ" అన్నాడు విచారంగా.

కాని మధుబాబు పరీక్ష ప్యాసయ్యాడు.

## 13

వేసవి సెలవులు. చాలా రోజులకు మధుబాబుకు సావకాశంగా ఆలోచించుకునేందుకు వ్యవధి దొరికింది. ఇంటికి వచ్చిన సాయంత్రం అలా నడుచుకుంటూ కృష్ణానదీ తీరానికి వెళ్ళాడు. కృష్ణా బ్రిడ్జిమీద, ఉపరితలంలోన మనుషులు నడవటానికి దారుంది. దానిమీద ఎక్కి నడుస్తూ, నడి మధ్యకు వచ్చి క్రింద ప్రవహిస్తోన్న నది తరంగాలని తిలకించసాగాడు. గతస్మృతులన్నీ తలుపుకు రాసాగినై. రాజ్యలక్ష్మి తనను అన్యాయం చేసి యీ లోకం నుంచి

నిష్క్రమించింది. తనకు యీ భూమ్మీద తల్లీ, తండ్రీ, అక్కా, చెల్లెలూ, తమ్ముడూ వీళ్ళంతా వున్నారు. అయినా వొంటరితనం పీడిస్తోంది. తను ఒక్కడూ ఒకటి, ప్రపంచమంతా ఒకటి అనిపిస్తోంది. ఏమిటో ఈ చదువు, ఈ అభివృద్ధి, ప్రాకులాట... ఎందుకోసం ఇదంతా?

ఆ రాత్రి బరువుగా గడిచింది.

మరునాడు ఉమాపతి కలిశాడు. ఎంతో హాయి అనిపించింది మధుబాబుకు. ఎంతో ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. తాను కొత్తగా రాసిన కథ ఒకటి వినిపించాడు ఉమాపతి. కథలో "మెరుపు" కనిపించలేదు మధుబాబుకు. వాస్తవానికి దగ్గరగా వున్నమాట యదార్ధమే. కావలిసినంత నిజాయితీ కూడా వుంది. కానీ ఈ రెండూ పుష్కలంగా ఉన్నంత మాత్రం చేత ఉత్తమ రచన అవుతుందా? కథకులుగా పేరొందిన ప్రముఖులు ఇదే పద్ధతిలో రాయటం చూశాడు మధుబాబు. వాస్తవికత పేరుతో ఇంత  పేలవంగా యెందుకు రచనలు తయారుచేస్తున్నారో బోధపడేదికాదు అతనికి. సాహిత్యానికి ప్రధానాంశమయిన అనుభూతి లోపిస్తుంది వాటిల్లో. సమగ్రత, నిండుతనం వుండటం లేదు వాటిల్లో. ఉమాపతి కూడా ఆ కోవకు చేరుకున్నాడు.

ఎట్లా వుందని అడిగాడు.

మధుబాబు మొహమాటస్తుడు. "బాగుంది" అన్నాడు క్లుప్తంగా. అది బాగున్నమాట వాస్తవమే. కానీ చాలా బాగుండేందుకు అనేక అభ్యంతరాలున్నాయి.

"మీరేం రాయటం లేదా?" అని అడిగాడు ఉమాపతి.

"లేదండీ, తీరిక వుండటంలేదు బొత్తిగా. మెడికల్ స్టడీస్‌లో పడిపోయాను. అదో ఊబి. ఆలోచించేందుకు తగిన కాలం, వ్యక్తితవం కోల్పోయే  వాతావరణం."

చాలాసేపు ఏవో మాట్లాడుకున్నారు. గుమస్తా ఉద్యోగం చేస్తూ, ఆ మనస్తత్వాన్ని పూర్తిగా జీర్ణించుకున్న ఉపాపతి ఆ పరిసరాల్లోంచే సమస్యలని తీసుకుంటున్నాడు. ఆర్ధిక శాస్త్రం చదివి, అందులో లోతు పాతులను అర్ధం చేసుకోవాలని ఉబలాటపడ్తున్నాడు.

మళ్ళీ రాయాలన్న జిజ్ఞాస రేకెత్తింది మధుబాబులో. ఆ రాత్రి పడుకున్నప్పుడు తీవ్రంగా ఆలోచించాడు. కానీ ఓ గమ్యం చేరలేదు. చికాగ్గా నిద్రపోయాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments